క్లుప్తంగా

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో లోవోల్టేజీ సమస్య పరిష్కారమైంది. ఇటీవల వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పర్యటించిన సందర్భంగా విద్యుత్ సమస్య గురించి కాలనీవాసులు వివరించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు 25 కేవీ ట్రాన్స్ ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు బుధవారం ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

దేశాయిపేట: నగరంలోని 12వ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని డివిజన్ బీజేపీ నాయకుడు గోకె వెంకటేష్ అన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదని, కుక్కల బెడద అధికంగా ఉందని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఖిలా వరంగల్: వరంగల్ ఇన్నర్‌రింగ్ రోడ్డు కింద భూములు కోల్పోయిన భూ బాధితులకు 2019వ సంవత్సరం నుంచి పరిహారం చెల్లించలేదని, ఈక్రమంలో తమకు న్యాయం చేయాలని భూ బాధితులు డిమాండ్ చేశారు. వరంగల్ మధ్యకోటలో తీగల శ్రీధర్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ధర్మారం వరకు ఇన్నర్ రింగ్‌రోడ్డు కింద భూములు కోల్పోతున్న భూ బాధితులకు పరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలకుర్తి సత్యం, దయాకర్ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి




కాజీపేట రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌పై దృష్టి పెట్టాలని కాజీపేట ఎస్సై వి.లవన్‌కుమార్ సూచించారు. ట్రాఫికింగ్ అండ్ డ్రగ్స్‌పై కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఎస్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ సభ్యులపై చర్య తీసుకోవాలి

హన్మకొండ అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా ఆరేళ్లు దాటిన పాలకవర్గ సభ్యులపై గవర్నర్ ఉత్తర్వుల మేరకు చర్య తీసుకోవాలని జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రావీణ్య సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఆరేళ్లుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఉన్నవారు విధిగా తప్పుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర గవర్నర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ బ్రాంచ్ పాట్రన్ పొన్నాల రామ్మోహన్, లైఫ్ మెంబర్స్ పొన్నాల సంయుక్త, మండల పరశురాములు, డాక్టర్ సనత్‌కుమార్, పీవీ శ్రీనివాసరావు, బూర రామచందర్, పెండ్లి ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని బీసీ నేత హాస్టల్ భవనంలో సమైఖ్య వాక్ ఫౌండేషన్, అశ్విన్ ఆరోగ్య ఆశ్రమం సంయుక్తంగా పదిరోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని డాక్టర్ వన్నాల వెంకటరమణ తెలిపారు. శిబిరంలో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం వైద్యులకు సర్టిఫికెట్లు అందజేశారు.

దాతలు సహకరించండి

నయీంనగర్: మిగిలిన ఆహారాన్ని సేకరించి ఆకలితో ఉన్న వారికి అందించడం కోసం ఓమ్ని వాహనం కొనుగోలుకు దాతలు సహకరించాలని అడ్వాన్స్‌డ్ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నార్లగిరి రాజు కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫంక్షన్‌లో మిగిలిన ఆహారం వృథా కాకుండా గ్రేటర్ వరంగల్ పరిసర ప్రాంతాల్లో మూడేళ్లు ఫౌండేషన్ ద్వారా అనాథ, వృద్ధ ఆశ్రమాలు, ఆకలితో ఉన్నవారికి అందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు హర్షవర్ధన్, ప్రశాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



హన్మకొండ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

హన్మకొండ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్యాయం చేసిందని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి విమర్శించారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీల ఊసు లేకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, సైనిక స్కూల్, మామునూరు విమానాశ్రయాలను పట్టించుకోలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి నిధులు తేలేని బీజేపీ ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలని, లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొగ్గల తిరుపతి, వాంకుడోత్ వీరన్న, మంద సంపత్, ధరావత్ భానునాయక్, కారు ఉపేందర్, లింగమూర్తి, రాజు, ఎన్టీఆర్, లాలు, రమ, మంజుల పాల్గొన్నారు.



హన్మకొండ: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

తెలంగాణపై మరోసారి మోదీ వివక్ష

హన్మకొండ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం మొండిచేయి చూపిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఈమేరకు హనుమకొండ కాళోజీ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి తెలంగాణ పట్ల ప్రధాని నరేంద్ర మోదీ కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లుగా రాష్ట్రానికి ప్రతీ బడ్జెట్‌లో అన్యాయం చేస్తూనే వస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎస్.అశోక్ స్టాలిన్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, జక్కు రాజు, రమాదేవి పాల్గొన్నారు.



ఖిలా వరంగల్: అండర్ బ్రిడ్జి వద్ద కేంద్రం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

ఖిలా వరంగల్: విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం.. బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపిందని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా విమర్శించారు. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రైతులు, పేద గ్రామీణ కూలీలు, ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావనే లేదని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి, స్పష్టమైన సమగ్ర చట్టం కార్మిక వర్గానికి బడ్జెట్‌లో చోటు దక్కలేదన్నారు. కార్యక్రమంలో దండు లక్ష్మణ్, బుస్స రవీందర్, సభ్యులు శరత్, ఓర్సు రాజు, పరికిరాల రమేష్, అంజద్, వెంకటాద్రి, కుమార్, భవాని, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: బడ్జెట్‌లో విద్యారంగానికి సరైన నిధులు కేటాయించకుండా కేంద్రం మొండి చేయి చూపిందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రోడ్డుపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ కూటమి బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు జస్వంత్, సహాయ కార్యదర్శి అనూష, బాధ్యులు సాయి అభిషేక్, సృజన్, రాహుల్, మణితేజ, భరత్, విజయ్, వివేక్ పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

వరంగల్ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఎన్డీఏ సర్కారు మొండి చేయి చూపిందని ఎంసీపీఐ (యూ) నగర కార్యదర్శి జగదీశ్వర్ విమర్శించారు. వరంగల్ అండర్ రైల్వేగేట్ సమీపంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం నుంచి ఇద్దరు బీజేపీ కేంద్ర మంత్రులు, 8మంది ఎమ్మెల్యేలు ఉన్నా బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని ధ్వజమెత్తారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సామాన్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



ఆర్ట్స్ కళాశాల వద్ద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



హసన్‌పర్తి: నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్

హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ అన్నారు. మేకల వంశ వేదిక ఆధ్వర్యంలో హసన్‌పర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని ప్రశంసించారు. మేకల వంశ వేదిక అధ్యక్షుడు మేకల యుగంధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మేకల వంశ వేదిక ప్రధాన కార్యదర్శి మేకల హరిశంకర్, ఉపాధ్యక్షుడు ఆనంద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్‌బుక్స్ అందజేత

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో చదువుతున్న దివ్యాంగ పీజీ విద్యార్థినులకు అనురాగ్ సొసైటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ పాకలమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు.

అందుబాటులో ప్రకృతి వైద్య విజ్ఞానం

కేయూ క్యాంపస్: అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞాన సంపదను ఇంటర్నేషనల్ లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఆచార్య రామేశ్వరం అందుబాటులో ఉంచారని, ఆ విజ్ఞానాన్ని ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి సూచించారు. హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేటలోని తన స్వగృహంలో రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ నేచురోపతి లైబ్రరీని రిజిస్ట్రార్ సందర్శించి మాట్లాడారు. అనేక భాషల్లో అరుదైన ప్రకృతి వైద్యానికి సంబంధించిన పుస్తకాలు, గ్రంథాలు, జర్నల్స్ లైబ్రరీలో వేలల్లో ఉన్నాయని వివరించారు. ఇంటర్నేషనల్ నేచురోపతి లైబ్రరీతో కేయూలోని లైబ్రరీ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ విభాగంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకునేందుకు నిర్ణయించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. కార్యక్రమంలో కేయూ లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్లు గిరీషం, విద్యాసాగర్‌రెడ్డి, సత్యనారాయణ, చార్టెడ్ అకౌంటెంట్ లక్ష్మణాచారి, డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు వివరిస్తున్న రామేశ్వరం

ఘనంగా కట్ట మైసమ్మ బోనాలు



హన్మకొండ: హనుమకొండ సమ్మయ్యనగర్‌లో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కట్ట మైసమ్మ బోనాల పండుగను స్థానికులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. సమ్మయ్యనగర్‌తో పాటు చుట్టుపక్కల కాలనీవాసులు బోనాలతో చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో అభివృద్ధి కమిటీ బాధ్యులు, కాలనీవాసులు మడిపల్లి సాంబయ్య, పోతుగంటి ఎల్లస్వామి, జీడిమెట్ల రవి, దామోదర్, జిలకర స్వామి, జిల్లపల్లి సుధాకర్, మడిపల్లి నరేష్, గూడూరు సురేష్, నర్వ మహేందర్, నగేష్, గూడూరు సదానందం, తొటం పెద్ద వెంకటయ్య, రావుల నరసింహ, రావుల వెంకటేష్, తుల శ్రీనివాస్, దేవర సమ్మయ్య పాల్గొన్నారు.

కరీమాబాద్‌లోని ప్రతాప్‌నగర్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ప్రతాప్‌నగర్‌లో గుండు మైసమ్మ, పోచమ్మ దేవాలయంలో ఆలయ పూజారి అయిత హరీశ్ ఆధ్వర్యంలో మైసమ్మ తల్లికి బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు భారీగా తరలివచ్చి మైసమ్మకు బోనాలు సమర్పించారు.

శక్తిని ఆదా చేయడం పౌరుల బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న కట్ల శ్రీనివాస్

ఖిలా వరంగల్: విద్యుత్ శక్తిని ఆదా చేయడం ప్రతీ పౌరుడి బాధ్యత అని వరంగల్ సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్జీసీ కోఆర్డినేటర్ విద్యాసాగర్ అధ్యక్షతన ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులకు ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై వరంగల్ హంటర్ రోడ్డులోని హైదరాబాద్ పబ్లిక్ హైస్కూల్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో నిత్యం ఉపయోగించే విద్యుత్ శక్తిని వీలైనంత ఆదా చేసి పర్యావరణ హిత జీవన శైలిని కలిగి ఉండాలని సూచించారు. సురేష్‌బాబు, కృష్ణమూర్తి, కృష్ణ, శ్రవణ్, వాసు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత

ఎంజీఎం: నగరంలోని సహృదయ వృద్ధాశ్రమంలో చిలకమ్మ (76) అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. ఈమేరకు ఆమె పార్థివ దేహాన్ని వైద్య విద్య నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించేందుకు ఆశ్రమ నిర్వాహకురాలు యాకూబీ ముందుకు వచ్చారు. చిలకమ్మ మృతదేహాన్ని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అటానమీ విభాగాధిపతి డాక్టర్ పద్మజ, డాక్టర్ శశికాంత, ప్రొఫెసర్ ప్రేమకుమార్, యాదగిరి, ప్రణవ్‌కు అప్పగించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. మరణాంతరం సామాజిక బాధ్యతగా శరీర దానం చేయాలనుకునే వారు 87905 48706 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శంకర్‌రావు, ఉపాధ్యక్షులు రాజమౌళి, రాజు పాల్గొన్నారు.



వైద్యులకు పార్థివదేహం అప్పగిస్తున్న బాధ్యులు

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



ఎంజీఎం: ప్రభుత్వ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కేఎంసీ విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంబి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ కలెక్టర్ 2024, జూలై 23న వెలువడించిన ఉత్తర్వులను (1/1149/2024) ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే వైద్యులపై ఇతర శాఖల అధికారుల పెత్తనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం కోశాధికారి డాక్టర్ కరుణాకర్, జాయింట్ సెక్రటరీ రాజేశ్వరి, సభ్యులు చిన్ని కృష్ణ, హనుమంతరావు, రాంమోహన్, అర్చన, మాధవి, సునీత, విద్యాసాగర్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు దామెర భిక్షపతి, సదానందం, సంజీవ, హరిశంకర్, జోత్స్న, దేవేంద్రచారి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

30శాతం నిధులు కేటాయించాలి

విద్యారణ్యపురి: ఈనెల 25న ప్రవేశపెట్టబోయే రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సంజయ్, రాహుల్, శ్రీకాంత్, భరత్, అశోక్, ప్రవీణ్, అఖిల్, దీప్, మనీష్ పాల్గొన్నారు.

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యం కల్పించాలని విద్యార్థి నాయకుడు హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. 30 శాతం నిధులు కేటాయిస్తే ప్రభుత్వ విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలు, కళాశాలల పరిస్థితులు మెరుగవుతుందన్నారు.

నగరాభివృద్ధికి నిధులు కేటాయించాలి

హన్మకొండ: వరంగల్ మహానగర అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు కోరారు. నగర సమస్యలను పరిష్కరించడానికి రూ.615 కోట్లు అవసరమవుతాయని ఇటీవల నగరాభివృద్ధి సమీక్ష సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు.

వేంకటాచల గిరిప్రదక్షిణతో మోక్షం

హన్మకొండ కల్చరల్: వెంకటాచలం గిరి ప్రదక్షిణలు చేస్తే పాపాలుతొలగి, మోక్షం సిద్ధిస్తుందని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రవచకులు కృష్ణకుమార్ అన్నారు. హనుమకొండ ఏకశిల పార్కు బాలసముద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సీతారామ ప్రసన్నాంజనేయ స్వామి నేతృత్వంలో రెండవ రోజు బుధవారం వేంకటాచలం మహత్యంపై ప్రవచనం సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటాచలం చరిత్రను విన్న, వీక్షించిన పుణ్యం లభిస్తుందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు డింగిరి శ్రీనివాసచార్యులు, టీటీడీ కార్యక్రమం నిర్వాహకుడు రామిరెడ్డి, కృష్ణమూర్తి, అరుణ, దేవేందర్ రెడ్డి, ఉపేందర్, కనపర్తి రఘువీర్ పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు

మడికొండ: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంపై ఉన్న విజయగణపతి ఆలయంలో బుధవారం సాయంత్రం పంచామృతాభిషేకాలు, గరికలతో విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పరశురాం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ మంత్రోచ్చరణల మధ్య వైభవంగా పూజలు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి కే.శేషభారతి, పైడిపాల రఘుచందర్, బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, జ్ఞానేశ్వరి, భక్తులు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో సంకటహర చతుర్థి పూజలను బుధవారం రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భక్తులతో కలిసి గణపతి హోమం జరిపించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేసి వెండి తొడుగులతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

హసన్‌పర్తి: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కాప్ జెమిని డైరెక్టర్ మణికంఠ శ్రీనివాస్ సూచించారు. నగరంలోని ఎస్వీఎస్ కళాశాల పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడింగ్‌లోని నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడమే సాఫ్ట్‌వేర్ సక్సెస్ మంత్రంగా పేర్కొన్నారు. ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ క్రమశిక్షణతోనే ఉన్నత స్థానానికి ఎదగవచ్చని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల ఆశాకిరణం కేటీఆర్



హన్మకొండ: కేక్ కట్‌చేస్తున్న వినయ్‌భాస్కర్



రామన్నపేట: పండ్లు పంపిణీ చేస్తున్న నరేందర్

హన్మకొండ/రామన్నపేట/ సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ భవిష్యత్ తరాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆశా కిరణం అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను నగర వ్యాప్తంగా నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ వరంగల్ జిల్లా నాయకులు దాచేపల్లి సీతారాం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఎం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రాంతీయ రవాణాశాఖ సభ్యులు గోరంటల మనోహర్, మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మికి రమేష్‌బాబు, 24వ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మున్సిపల్ ఉద్యోగుల బదిలీలు నిలిపేయండి

వరంగల్ అర్బన్: మున్సిపల్ నాలుగవ తరగతి ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హైదరాబాదులోని పురపాలక శాఖ అడిషనల్ డైరెక్టర్ జాన్ శ్యాంసన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షపతి మాదిగ, జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ధర్మరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, వర్కింగ్ ప్రెసిడెంట్లు భాస్కర్, టీఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి రఘు, జిల్లా అధ్యక్షుడు మూర్తి రాజు, ఉపాధ్యక్షులు నమిండ్ల కృష్ణస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట: ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ ప్రధాన రహదారిపై వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు బొమ్మల అశోక్ కుమార్, పిల్లి అనిల్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్టు చేశారు

కేయూ క్యాంపస్: పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు బుధవారం అక్రమంగా అరెస్టు చేశారని కేయూ రీసెర్చ్ స్కాలర్, పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు ఆరోపించారు. విద్యారంగ సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలన్నారు. అరెస్టయిన వారిలో నర్సింహారావుతో పాటు పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు మర్రి మహేష్, కార్యదర్శి గణేష్, వినయ్ ఉన్నారు.


కేంద్ర బడ్జెట్‌లో దక్కని ప్రాధాన్యం

హన్మకొండ: కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం దక్కలేదని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సోమిడి అంజన్‌రావు తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండి చేయి చూపించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముదిరాజ్ నగర ఉపాధ్యక్షుడిగా సంపత్

వరంగల్ చౌరస్తా: గ్రేటర్ వరంగల్ ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడిగా కరీమాబాద్ శాకరాశికుంటకు చెందిన బండి సంపత్‌ను నియమించినట్లు అధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆయనకు హనుమకొండలో నియామక పత్రం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



హసన్‌పర్తి: గ్రామాల అభివృద్ధికి మాజీ సర్పంచ్‌లు, నాయకులు సహకరించాలని మండల పరిషత్ పంచాయతీ అధికారి కర్ణాకర్‌రెడ్డి కోరారు. ఎంపీఓగా బాధ్యతలు చేపట్టిన కర్ణాకర్‌రెడ్డిని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, జనగాని శరత్, జీవన్‌రెడ్డి, పెద్ది మల్లారెడ్డి, విజయకుమార్, రాజు, కిరణ్, మదన్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, జె.రవి, మాజీ ఉప సర్పంచ్ రాజు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.